14న గిరిప్రదక్షిణ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న దేవాలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఎంపీని కలిసిన జైపాల్‌రెడ్డి



మణికొండ: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజల మేలు కోరే వ్యక్తిని భువనగిరి ప్రజలు ఎంపీగా గెలిపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓంప్రకాశ్‌రెడ్డి, పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ సమీపంలో ఉన్న సమతా స్ఫూర్తి కేంద్రం ఆవరణలో ఆదివారం రథయాత్ర నిర్వహించారు. ఇక్కడ 108 దివ్య దేశాలలో ఒకటైన శ్రీ ఆది జగన్నాథ పెరుమాళ్ రథోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



చీరలు అందజేస్తున్న సంజయ్‌యాదవ్, శ్రీధర్‌యాదవ్

శంషాబాద్: వైఎన్నార్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన శంషాబాద్ మాజీ సర్పంచ్ లక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర డైరీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గణేష్‌గుప్తా, వెంకటేష్‌గౌడ్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులకు లక్ష్మీబాయి కుమారులు, కౌన్సిలర్ సంజయ్ యాదవ్, శ్రీధర్‌యాదవ్ చీరలు పంపిణీలు చేశారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024ను ఎగ్జిబిషన్‌ను నటి, యాంకర్ భార్గవి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ చేనేతకారులను ప్రోత్సహించాలని, నగర ఫ్యాషన్ ప్రియులను ఈ ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. వస్త్ర ప్రదర్శన ఈ నెల 14 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

‘సీతంబాయి పాలం’ కథల సంపుటి ఆవిష్కరణ

రాయదుర్గం: తెలంగాణకు చెందిన ప్రముఖ కథా రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఏఎం అయోధ్యరెడ్డి తాజా కథల సంపుటి ‘సీతంబాయి పాలం’ పుస్తకావిష్కరణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని జర్నలిస్టుకాలనీలో సొసైటీ కార్యాలయం హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఏఎన్ జగన్నాథశర్మ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశానికి హాజరైన అయోధ్యరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత స్పీడ్ యుగంలో కథలు చదివే పాఠకులు కరువయ్యారని, మరీ ముఖ్యంగా ఈ తరం యువత, పిల్లలు తెలుగు సాహిత్యానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . కార్యక్రమంలో పలువురు సీనియర్ కవులు, రచయితలు, కార్టూనిస్టులు, జర్నలిస్టులు వేణుగోపాలస్వామి, ప్రతాప్‌రెడ్డి, గురువారెడ్డి, లక్ష్మణ్‌రావు, రమణజీవి, సురేంద్ర, నర్సింమ్, తల్లావజ్ఝల లలితాప్రసాద్, తిరుమలగిరి సురేందర్, పెద్దిరాజు, జగన్, హన్మంతురావు, దొర్బాల బాలశేఖరశర్మ పాల్గొన్నారు.





చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద వాహనాల రద్దీ

యూటర్న్ ప్రాబ్లమ్

జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు.. ట్రాఫిక్ కష్టాలు

హఫీజ్‌పేట్: చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్‌లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారిలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సిగ్నళ్ళను మూసి వేసి యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. దీని వల్ల కొంత మేర ఉపశమనం కలిగినప్పటికి యూ టర్న్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారులపై మలుపులు ఉండరాదనే నియమాలు ఉన్నప్పటికీ.. చందానగర్, గంగారం ప్రాంతాలు నగరానికి చేరువుగా ఉండడంతో ఇక్కడ యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఇవి ట్రాఫిక్ జామ్‌లకు ఆలవాలంగా మారాయి. నిత్యం ఐటీ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం సమయాలలో భారీగా రాకపోకలు చేస్తుంటారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. కాగా పలు రహదారులపై పాదచారులు జీబ్రా క్రాసింగ్‌తో సాఫీగా రోడ్డు దాటుతున్నారు. కానీ సిగ్నళ్లు మూసివేసినప్పటి నుంచి పాదచారులు రోడ్డు దాటాలంటే అష్టకష్టాలు పడుతున్నారు.

- చందానగర్, గంగారం ప్రాంతాలలో ఉన్న యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ జాంలు తీవ్రంగా ఉంటున్నాయి.
- జాతీయ రహదారి కావడంతో సాయంత్రం పూట ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం.
- పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌తో కూడిన సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి.
- ట్రాఫిక్ సమస్య ఏర్పడే యూ టర్న్‌లను మూసివేయాలి .
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్లు గుర్తించాలి.
- నిత్యం యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





మలుపుల వద్ద ప్రమాదాలు



చందానగర్ నుంచి గంగారం వరకు మూడు యూటర్న్‌లు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ తీవ్రంగా ఉంది. రద్దీ సమయంలో పాదచారులకు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ జామ్‌లు నెలకొనకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– శేఖర్, చందానగర్

అవసరమైన చోట సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



చందానగర్ జాతీయ రహదారిపై అవసరం ఉన్న చోట సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. యూ టర్న్‌ల వల్ల కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గినా ప్రమాదాలకు దారితీస్తుంది. –అశోక్, చందానగర్

మాదిగల హక్కుల సాధనకే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు



నెక్నాంపూర్‌లో జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

మణికొండ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం, పుప్పాలగూడ సంతోష్‌నగర్, నెక్నాంపూర్ గ్రామాలలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి పి.గణేష్‌మాదిగ పాల్గొని మాట్లాడారు. మాదిగల హక్కుల సాధన, ఏబీసీడీల వర్గీకరణకే ఎమ్మార్పీఎస్ పుట్టిందన్నారు. దివ్యాంగులు, ఫ్లోరైడ్ బాధితుల గురించి అనేక పోరాటాలు చేసిందన్నారు. మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో త్వరలోనే వర్గీకరణ సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, జ్ఞానేశ్వర్, దశరథ్, రవి, నరేందర్‌మాదిగ, గౌతమ్ మాదిగ, అనిల్‌కుమార్, శ్రీకాంత్, పాండు, సునీల్ పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ చౌరస్తాలో..

రాజేంద్రనగర్: ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శ్రీరాంనగర్ చౌరస్తాలో జెండా ఎగరవేశారు. అదే విధంగా మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. లింగని కృష్ణ, జోగి రవి, పాట్లావత్ రామారావు, చంద్రశేఖర్, బాలస్వామి, వెంకటయ్య, మాధవులు, అరుణ్, హరినాథ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న లతాప్రేమ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని యాదయ్యనగర్, ఇంద్రనగర్, శ్రీనివాసనగర్ కాలనీలలో సీసీ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కాలనీలో శిథిలావస్థకు చేరిన రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు నూతన రోడ్లు వేస్తున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో గోతులమయంగా మారిన రోడ్లపై ప్రయాణించే ప్రజలు, వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో చర్చించి నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చంద్రశేఖర్, నాయకులు టింకురెడ్డి, వినయ్‌రెడ్డి, కుమార్‌యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

మొక్కలు పెంచేలా విద్యార్థులను ప్రోత్సహించాలి



వనమహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తాపూర్: మొక్కల పెంపకం ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబం, ఉపాధ్యాయులపై ఉందని లిటిల్ స్టార్ హై స్కూల్ ప్రిన్సిపాల్ జువేరా బేగం అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్‌వే-23 పిల్లర్ సమీపంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలతో పాటు ఇళ్లల్లో మొక్కలను పెంచేలా విద్యార్థులకు ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మొక్కలను ఎలా నాటాలి, ఎంత లోతు వరకు గోతి తీయాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మహమ్మద్ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిశుభ్రతకు పాటుపడాలి



వ్యర్థాలు సేకరించిన సంస్థ సభ్యులు

మణికొండ: మనకు తాగునీటిని అందించటంతో పాటు ఎన్నో జీవరాశులకు నిలయాలైన చెరువులను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు పాటు పడాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాష్ట్ర సర్వీస్ హెడ్ విశాల్ ఆర్య అన్నారు. ఆదివారం గండిపేట చెరువు పరిసరాలలో ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులను అపరిశుభ్రం చేయటం అంటే మన ఆరోగ్యాలను మనమే చెడగొట్టుకోవటమే అన్నారు. పరిసరాలతో పాటు ప్రతి సంవత్సరం చెరువులను పరిశుభ్రం చేయాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాల్ కాం సంస్థ డైరెక్టర్ అజయ్‌సేతి, మైక్రోసాఫ్ట్ డైరెక్టర్ జతిన్‌పురి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి శ్వేత పురం పాల్గొన్నారు.

గోల్కొండ బోనాలకు తరలిన భక్తులు




బోనాలను సమర్పించిన కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



మణికొండ క్వార్టర్స్ నుంచి తొట్టెలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న కాలనీ వాసులు

మణికొండ: ఆషాఢమాసంలో అమ్మవార్లకు నిర్వహించే బోనాల ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. అందులో మొదటి బోనం గోల్కొండ జగదాంబకు సమర్పించి ఉత్సవాలను ప్రారంభించటం ఆనవాయితీగా వస్తుంది. గోల్కొండలో నిర్వహించే బోనాలు ఉత్సవాలలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి మొక్కులు సమర్పించుకుంటారు. అందులో భాగంగా ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో మొదటి రోజు బోనాలు సమర్పించారు. మణికొండ మున్సిపాలిటీ క్వార్టర్స్ నుంచి అమ్మవారికి తొట్టెలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, వేణుగౌడ్, రాము, శ్రీపాల్‌రెడ్డి, మణికొండ క్వార్టర్స్ దివ్యజ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి దేవీ నవరాత్రి ఉత్సవాలు



కొలువుదీరిన అమ్మవారు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని అందంగా అలంకరించారు. తెల్లవారుజామున అభిషేకం, అలంకరణతో పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ పూజ కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలు, అలంకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

అత్తాపూర్: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ నవాజుద్దీన్ అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ఆదివారం కార్పొరేటర్ మహమ్మద్ నవాజుద్దీన్ విజ్ఞప్తి మేరకు సులేమాన్ నగర్, ఎంఎం పహాడి ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మొహర్రం సందర్భంగా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేయిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవికుమార్ పేర్కొన్నార. ఈ కార్యక్రమంలో మహ్మద్ గౌస్, మహమ్మద్ మోసిన్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ నీటిని పారబోస్తున్న సుష్మా

శంషాబాద్: ప్రస్తుతం సీజన్ వ్యాధుల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆదివారం తన ఇంటి పరిసరాల్లో చైర్‌పర్సన్ పరిశుభ్రత చర్యలు చేపట్టారు. నిల్వ ఉన్న మంచి నీటి ద్వారా డెంగీ దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చిప్పలు ఇతర వస్తువుల్లో నీటి నిల్వలు ఉండ కుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం




కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పట్టణం ఉప్పర్‌పల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. హైందవనగర్ గోల్కొండ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక కార్యకర్త, ప్రముఖ జర్నలిస్టు మేడం మధుసూదన్, విశిష్ట అతిథిగా, వక్తగా రాకా లోకం, యూట్యూబ్ ఎడిటర్ రాక సుధాకర్ హాజరయ్యారు. సంఘ సేవ, ధర్మ పరిరక్షణ, హిందూ సంస్కృతి ఔన్నత్యాన్ని కాపాడటంలో ఆర్‌ఎస్‌ఎస్ పోషిస్తున్న పాత్ర అమోఘమైందన్నారు. శతాబ్ది ఉత్సవాల గడపలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచ వ్యాప్తంగా కొత్త చరిత్రను సృష్టించబోతుందని వెల్లడించారు.

గుల్‌మొహర్‌పార్కు కాలనీలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీలో హెచ్‌ఎస్‌బీసీ ఇండియా, ది సోషల్ యునైటెడ్ వే ముంబై వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబలతో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. గాంధీ మాట్లాడుతూ ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాలనీవాసులతో పాటు పార్కుకు వచ్చే వారికి ఉపయోగపడుతుందన్నారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీవాసులు గ్రీనరీ అభివృద్ధి, పార్కు నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామియాదవ్, నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కాలనీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు మోహన్‌రావు, రఘురాం, ప్రభాకరాచారి, సభ్యులు పెంటోజీ, శేఖర్‌రావు, రాణి విక్టోరియా,శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, కృష్ణ చారి పాల్గొన్నారు.



హెచ్చరించినా మారని వైనం

పట్టణంలోని వివేకానంద కాలనీ సమీపంలో ఉండే ధర్మోజీ కుంటలో నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన నిర్మాణాల కూల్చివేతలకు సంబంధించిన వ్యర్థాలను పారబోస్తున్నారు. వ్యర్థాలు పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పర్యవరణ ప్రియులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినా చేశారు. అధికారుల హెచ్చరికను సైతం లెక్కచేయకుండా వ్యర్థాల డంప్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాలను డంప్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –శంషాబాద్